15. మనిషి

ఎన్నాళ్ళనుంచో ఆ విషయం వాణ్ని అడిగి తెలుసుకోవాలనుకుంటూ ఉండేవాణ్ని. పెళ్ళి అయినప్పటినుంచీ, ప్రభాకరంలో ఏదో వింతమార్పు కనిపించింది. మరీ భార్య కాపరానికి వచ్చాక, ఏదో అసంతృప్తి మాత్రం వాడి ముఖంలో స్పష్టంగా కనిపించేది. సంసార జీవితంలో మొదట్లోనన్నా కనిపించే ఉత్సాహం వాడిలో ఎంత వెతకినా కనిపించక పోవటం నాకు ఆశ్చర్యకరమే అయింది.

నేను ఊహించ గలిగినన్ని కారణాల్ని ఊహించాను. వాడి పరిస్థితులన్నీ ఒకటికి పదిసార్లు పరామర్శ చేసుకు చూశాను. కాని ఏ ప్రత్యేక కారణం వాణ్ని యీ స్థితికి లాగుతోందో నాకు అంతుపట్టలేదు.

"ఎందుకూ ఎప్పుడూ దిగులుగా ఉంటావ్?" అన్నాను, ఒకనాడు. ఇక ఊహించి లాభంలేదనీ, వాణ్ణే అడిగి తెలుసుకోవటంకన్న వేరుమార్గం లేదనీ నిశ్చయించుకొన్నాను.

"ఏమీ లేదు–" అని తప్పించుకోవాలని చూశాడు.

నేను అంతతో వదలక "సరిగ్గా చెప్పు. ప్రతి జీవితానికీ ఏదో వొక లోటు ఉండనే ఉంటుంది. కాని, కొన్ని సమస్యల్నీ లోపాల్నీ సర్దుకునే అవకాశంకూడా ఉంటుంది. నీకు నువ్వే ఏదో బాధగా ఉండటం నన్ను కూడా ఒక విధంగా బాధిస్తూనే ఉంది" అన్నాను.

వాడు ఏదో అనుమానంగా నా కళ్ళల్లోకి చూసి, తరువాత నిశ్శబ్దంగా ఆకాశం వైపు చూడసాగాడు.

"నా దగ్గర దాచాల్సినంత పెద్దకారణమా?" అన్నాను.

"ఊహుఁ" అన్నాడు, వినపడీ వినపడనట్టుగా.

"ఇంక చెప్పరాదూ? ఏదన్నా మందుందేమో వెతికేందుకు నేను సహాయ పడతానుగా?" అని ధైర్యం చెప్పాను.

కాస్త ఆగి మళ్ళీ "కానీ... చెప్పు–" అని హెచ్చరించాక, చెప్పేది తను కాదన్నట్టు వేరొక దిక్కు చూస్తూ, "ఏం లేదు. నా భార్య విషయం–" అని ఆగాడు.

ఏం? వాడి భార్యకేం? అందమైనదే! పెద్దింటినుంచి వచ్చింది కూడా. నలుగురితోనూ భుజాలుకలిపి తిరగగలిగే చాకచక్యం ఆమెలో లేకపోయినా, ఎవర్నీ నొప్పించకుండా తన పనేదో చూసుకుపోగల మనిషి. ఆమె అణకువ చూస్తే ఉత్తమ ఇల్లాళ్ళలిస్టులో జమవెయ్యక తప్పదు. విశేషించి ఆమె మాకు దూరపు బంధువుకూడాను. నేను విన్నంత వరకూ, నాకు తెలిసినంతవరకూ ఆమె చాలా మంచిది. ఇంక వీడు చెప్పేదేమిటి?

"నీ భార్యకేం?" అన్నాను మామూలు ధోరణిలోనే.

వాడికి కాస్త ధైర్యం వచ్చిందనుకుంటాను. గొంతు సవరించుకొని "అదేం ఖర్మమో కాని ఆ పెళ్ళయిన నాటినుంచీ నాకు చెడ్డరోజులేరా!" అన్నాడు.

"అంటే?" అన్నాను, అర్థమవక.

"పెళ్ళయిన సంవత్సరమే - ఎన్నడూ తప్పి ఎరగని నాకు బి.యే. పరీక్ష పోయింది..." ఆగి, నా ముఖంలోకి చూశాడు, సరిగ్గా ఆ మాటల్ని జీర్ణించుకున్నానో లేదో నన్నట్లు.

నవ్వాలో ఏడవాలో నాకు తెలియలేదు. వెంటనే పట్టరాని కోపం వచ్చినా, సౌమ్యవాదంచేసి వాణ్ణి ఒప్పించాలనే పట్టుదలవల్ల, ఏ భావాన్నీ వ్యక్తీకరించలేదు.

"ఐతే, పరీక్షపోవటం ఆమె తప్పేనంటావా?" అన్నాను.

"అనను... మొదట్లో నేనూ అట్లాగే సరిపెట్టుకున్నాను."

"మరి?"

"చెప్తే నమ్ముతావో లేదో కాని... ఆనాటినుంచే కుటుంబానికి అరిష్టం చుట్టుకుంది. ఐదు సంవత్సరాలనుంచీ కోర్టుల చుట్టూ తిరుగుతూ, అంతులేకుండా డబ్బు ఖర్చు పెడుతూ, తప్పకుండా గెలుస్తామనుకుంటూన్న దావా కాస్తా పోయి పాతికవేల ఆస్తికాస్తా క్షవరమైపోలా?"

"అందుకు ఆమె బాధ్యత ఏముంది?"

"లేకపోవచ్చు. కాని కొన్ని జాతకాలుంటయ్యే– మనిషి బతుకును అధోగతికి లాగేస్తయ్. భార్య జాతకం భర్తకు అనువర్తించటాన్ని ఏనాడో పెద్దలే రాసి పెట్టారు.

మొదట్లో నేనూ వీటిని నమ్మేవాణ్ణి కాదు ... కాని జీవితంలో ఇంతగా బాధపడుతూ, ఇన్ని దృష్టాంతరాలు కనిపిస్తూంటే ఇంకా ఎల్లా నమ్మకుండా ఉండ గలను?"

"ఇంకా?" అన్నాను, వాడి ధోరణిని ప్రోత్సహిస్తూ.

"ఆమె కాపరానికివచ్చి ఇంట్లో కాలుపెట్టింది... నాయనా, ఎన్ని అవస్థలు పడాలో అన్నీ పడుతున్నాం. రావాల్సిన బాకీలు రావు, ఇవ్వాల్సినవి ఆగవు... ఎంత పలుకుబడితో ఉద్యోగానికి ప్రయత్నంచేసినా నిష్ప్రయోజనమౌతోంది-"

ఇంక లేవా జీవితంలో అపజయాలు? తన ప్రయత్నాలూ, తన తప్పులూ, తన అదృష్టమూ ఎందుకు వీడు ఇతర్లమీదికి తోస్తాడు? ఇంక ఆపకపోతే వీడి ధోరణికూడా ఆగేటట్టు లేదు.

"పెళ్లినాడు ఐదువేల కట్నం తీసుకురాగలిగినప్పుడు ఆమె అదృష్టవంతురాలేగా?" అన్నాను.

"కాదురా-" అన్నాడు.

"పోనీ, నీ దురదృష్టమే ఆమె అదృష్టాన్ని పాడు చేసిందని ఎందు కనుకోవు?"

"ఎట్లా? ఇదివరకు నా పరిస్థితులన్నీ ఆమె రాకతో తారుమారయినయ్... నీకు అర్థమవదు. పొద్దున్నే లేచి ఆమె ముఖం చూస్తే చాలు - ఆనాడు విధిగా అవ్వాల్సిన పనులు కూడా ఎదురు తిరుగుతయ్-"

"నీ నమ్మకం అపాయపు పొలిమేరలు దాటుతోంది-"

నేను నవ్వటం మొదలుపెట్టాను. వాడికి కోపంకూడా వచ్చిందనుకుంటాను.

"పైవాళ్ళకు నవ్వులాటగానే ఉంటుంది. నాకు తెలుసు- యీ కారణాల్ని ఎవ్వరూ నమ్మరని. పై పెచ్చు నన్ను ఎగతాళి చేస్తారని కూడా ఎరుగుదును. అందుకే ప్రాణస్నేహితుడివైనా ఇన్నాళ్లూ నీకు చెప్పకుండా దాచాను. తీరా చెప్పాక- ఎందుకూ ఆ నవ్వు?"

వాడి కోపానికి నా నవ్వు భయపడ్డది.

"నువ్వు నా స్థితిలో వుంటే అర్థమయ్యేది" అన్నాడు.

ఇంక వాడితో ఈ విషయాన్ని వాదించటంకన్న, మానుకోవటమే అప్పటికి మంచిదిగా కనిపించింది. ఇంతవరకూ జరిగిన సంభాషణను మరిచిపోయినట్టుగానే నటిస్తూ, ప్రస్తావనను మార్చి, ఆ సాయింత్రానికి విడిపొయ్యాము.

కాని ప్రభాకరాన్ని చూసి జాలిపడ్డాను. ఎంత ఆలోచించినా ఆ జాలిని ఎల్లా వెల్లడించాలో నాకు అర్థమవలేదు. వాడు చెప్పిన విషయాలన్నీ నెమరువేసుకున్నాను. వీళ్ళ అదృష్టాదృష్టాల్ని భరించేందుకు భార్యల బాధ్యతకూడా వుందనే విషయం కొత్తగా కనిపించింది. వాడు ఇంకా ఎన్నివిధాలుగా నాకు రుజూచేసినా, ఆ జాతకం బాపతు

కీలకమేమిటో నాకు అర్థమవదు. వాడు నమ్మిన యీ విషయాన్ని నేను నమ్మనూలేను. పూర్వాచారాలమీద వాడు చేసిన తీవ్రవిమర్శ, జ్యోతిష్యం మీద, వాడు చూపే అపనమ్మకమూ పిచ్చి పిచ్చి సిద్ధాంతాల మీదా, ఆచారాల మీదా, వాడు కనపరిచే అగౌరవమూ- అన్నీ ఏమయినై? పైకి ఏవిధంగానూ కనిపించకుండానే, ప్రభాకరం ఇంత మార్పుతో యీనాడు నాకు కనిపించటం ఆశ్చర్యమే అయింది.

వాడి నమ్మకాన్ని పోగొట్టగలిగే శక్తి నాలో లేదు. "నీకు అనుభవంలేదు" అనే వాదనను తీసుకొచ్చాడంటే నేను ఓడిపోతాను. ఇం కేవిధంగానూ వాణ్ని ఒప్పించటంకూడా అసంభవం. ఇంకో రకం సమస్యయితే ఫరవాలేదు కాని కేవలం నమ్మకంమీద ఆధారపడ్డదాన్ని పోగొట్టటం మాటలా? అయినా యీ సమస్యతో నే నెందుకు బాధపడాలి?

ఆ సంబంధాన్ని ఎంత వదులుకుందామన్నా, ఎందుకోగాని మనస్సు అటువైపే లాగుతుంది. ఆ దంపతులు నాకు కావలసిన వాళ్ళవటమూ, వారు సౌఖ్యపడటమే నేను కోరేదవటమూ ఇందుకు కారణాలై ఉంటయ్యేమో?

తరువాత లోపాయికారీగా కనుక్కుంటే- వీడు ఇంట్లో కూడా ఆమెను సరిగ్గా చూడడట! చీటికీ మాటికీ ఆమె అంటే కసురుకుంటాడట. ఇంట్లోని మిగతా వాళ్ళు కూడా ఇదే ధోరణట! ఆమెమాత్రం అన్నింటినీ భరిస్తూ ఊరుకుంటుందట!

ఇది మరీ వింతగా తోచింది. అందరూ నమ్మితే ఆమె గతేంకాను? జీవితాంతం వరకూ కలిసి మెలిసి ఉండాల్సిన భార్యాభర్తల్లోనే యీ విభేదం వస్తే - ఇంక ఆ కాపరం సంగతి అడగనా?

ఎంత చెప్పినా ప్రభాకరం వినేరకం మనిషి కాదని నాకు తెలుసు. ఐనా, ఇంటి విషయాల్లో మధ్య నేనెల్లా కల్పించుకొని యీ ఉరితాటిని మెడలో వేసుకొని, ముందు మా మిత్రత్వానికే స్వస్తి చెప్పుకోను?

ఎంత ప్రయత్నించినా అది మరపురాని విషయమైంది. ఇంత దుర్భల హృదయంతో తన బతుకు నంతట్నీ అదృష్టం మీద మోపి- ఆ బరువును ఇంకో వ్యక్తి భుజాలమీద మోపటంలో వీడి అభిప్రాయ మేమిటి? ఏదో పిచ్చి కోపం వచ్చింది- కాని ఏం చెయ్యను? ఎట్లా రుజూ చెయ్యను? కాలులో విరిగిన ముల్లులాగు కలుక్కలుక్కనే యీ రకం విషయాన్ని ఎల్లా మరిచిపోను?

2

ఒక సంవత్సరం గడిచింది; కాని ప్రభాకరం యేమీ మారినట్టు కనిపించదు. రోజురోజుకూ వాడి ఆందోళన ఎక్కువౌతోంది.

ఒక మధ్యాహ్నం నా దగ్గరకు వచ్చాడు. వాడి ముఖంమీది నవ్వు చూసేప్పటికే ఏదో మంచివార్త వచ్చిందని గ్రహించాను.

"చూశావూ– ఆమెను కానుపుకు పంపాను, ఇటు సర్వీస్ కమిషన్ పరీక్షలో పాసయ్యాను. ఇదివరకు నువ్వు నమ్మలేదు..." అని ఆ కాగితాల్ని నా ముందు పడేశాడు.

నే నేమీ మాట్లాడలేదు. మరొక వారానికల్లా వాడు ఉద్యోగంలోకి వెళ్ళిపొయ్యాడు. ఈ నిదర్శనాన్ని ఆధారం చేసుకొని, వీడికోసమని ఒక్కసారిగా నే నెల్లా మారను?

మరొక నెల గడిచాక– అనుకోకుండా ఒక సాయింత్రం మళ్ళీ నా దగ్గరకు వచ్చాడు. వాడి ముఖంలో ఏ భావమూ స్పష్టంగా లేదు.

"ఏమిటి విశేషం?" అన్నాను.

"మా ఆవిడ పోయింది" అన్నాడు.

"ఆఁ" అన్నాను ఆశ్చర్యపడుతూ.

ఆమె మృత్యువు వాణ్ని ఆందోళనపరచలేదు. చావసిద్ధమైన ముసలివాళ్లు పోతే కలిగే బాధకన్న ఎక్కువ బాధకు వాడు గురవలేదు. ఇష్టంలేని వ్యక్తి పోవటం వల్లనే వాడు లెక్క చెయ్యలేదేమో?

"ఆమె పోయినందుకూ నేనంత విచారించను... కాని..."

నేను వింటూ ఊరుకున్నాను.

"పొయ్యేది ఊరకనే పోయిందీ? ఒక కొడుకునుకూడా నా మెడకు చుట్టి మరీపోయింది."

అదా వీడి విచారం? బతికి ఉండి ఆమె వీడికి చేసిన హానికన్న, చచ్చి చేసిన హానే ఎక్కువన్నమాట!

"నువ్వా విషయాన్ని గూర్చి బాధపడటం దేనికి?"

"వాణ్ణి ఎట్లా పెంచను?"

"రెండో పెళ్ళిచేసుకో–" అని సలహా ఇచ్చాను.

"ఈ సత్రకాయ ఒక దుండె... పిల్లనిచ్చేవాడు దొరకొద్దూ?"

ఎవరెట్లా పోయినా, మానవుడు స్వసౌఖ్యంకోసం పడే తిప్పల్ని, పాపం విప్పి చెప్పాడు. ఆమె వీడి పెళ్ళికే ఆటంకాన్ని సమకూర్చిపోయింది. ఏమైనా నా దృష్టిలో, ఆమె యీ దురదృష్టానికి బాధ్యురాలవటంకన్న, పోవటంవల్లనే అదృష్టవంతురాలైంది.

"తరువాత ఆలోచించుకోవచ్చులే–" అన్నాను.

"అదే..." అని ఊరుకున్నాడు.

మరొక నెల గడిచాక ఇంకోచిత్రం జరిగింది. హఠాత్తుగా ప్రభాకరం మళ్ళీ నా దగ్గరకు వచ్చాడు, ఏదో తాజావార్తను తెచ్చిన విలేఖరిలాగు.

"ఏమిటి?" అన్నాను, వాడి ముఖంలోని తొందరను చూసి.

"మా బావమరిది పొయ్యాడు-" అన్నాడు, కనిపించీ కనిపించని చిరునవ్వుతో.

నేను ఆశ్చర్యపొయ్యాను. పాపం, వాళ్ళ కుటుంబానికి మిగిలిన ఒక్కడుకూడా పొయ్యాడన్నమాట!

ఇక వీడి ముఖం ఎందుకు తేటగావుందో కూడా నేను ఊహించగలను. మామగారిది నలభైవేల రూపాయిల ఆస్తి వీడికి రాబోతోంది.

"సరే.... మంచి అదృష్టవంతుడివే" అన్నాను.

వాడు ఒప్పుకున్నట్టు తల ఊపాడు. నాకు ఇంకో అనుమానం కూడా తీరలేదు.

"ఇంతకూ నీ భార్య అదృష్టవంతురాలేనా?" అన్నాను.

ఈ మాటలతో వాడు సిగ్గుపడతా డనుకున్నాను. కాని మామూలు ధోరణిలోనే, "ఆమె దేముందిరా? అటు పుట్టింటికి కానుపుకని వెళ్ళిందో లేదో, వాళ్ళకు అరిష్టం వచ్చె-" అన్నాడు.

ఇంకేం- ఆమె చచ్చికూడా వీడి దృష్టిలో నష్టజాతకురాలే! వీడి నమ్మకం కూడా యీ జన్మలో తీరదు.

"సరే... నీ రెండో పెళ్ళిమాటేమిటి? ఈ మధ్య ఎక్కడో సంబంధం కూడా కుదిరిందటే?" అన్నాను.

"కుదిరింది... కాని ఎట్లా చేసుకోను?"

"ఏం?"

"ఆస్తంతా కుర్రాడికేగా? నేను ఇంకోపెళ్ళి చేసుకొని ఆస్తితో ఎట్లా సంబంధం పెట్టుకోను? కుర్రాణ్ని కనిపెట్టి వుంటే మంచి ఛాన్సు వుంటుంది గాని-"

నాకు ఒళ్ళుమండి, "అంతేలే... నువ్విప్పుడు పెళ్ళి చేసుకుంటే ఆ వచ్చే భార్య నిజంగా దురదృష్టాన్ని నీకోసం తీసుకొచ్చి, మీ ఇంట్లో దింపుతుంది" అన్నాను.

వాడు తెల్లముఖం వేసి, గట్టిగా ఊపిరి పీల్చాడు.

- ఏప్రిల్, 1942